సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం, 15, నవంబర్, 2023



కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం 5,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాంలో 25 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేకువజామున చలితో పాటు మంచు కురుస్తోంది. ఆకాశం మేఘావృతమైంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించండి



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: తప్పుల్లేని ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ భాగ్యరేఖ కోరారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో ఎన్నికల అధికారులు, అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.... జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు పూర్తయ్యే యువత ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఫారం 6, 7, 8లలో ఏవైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటన్నింటి పరిశీలించి డిసెంబర్ 26వ తేదీ నాటికి క్లెయింలు పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. 2024 జనవరి 5వ తేదీన ఓటరు తుది జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, డీటీ నరసింహులు, టీపీఓ ధర్మరాజు, అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ
- ఐసీడీఎస్‌లో 22 పోస్టులకు 849 దరఖాస్తులు



పుట్టపర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

పుట్టపర్తి అర్బన్: ఐసీడీఎస్‌లో పోస్టులకు భారీగా దరఖాస్తులు అందాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న 22 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, దరఖాస్తు స్వీకరణకు చివరిరోజైన నవంబర్ 8వ తేదీ సాయంత్రం వరకూ 849 దరఖాస్తులు అందినట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తెలిపారు. డీసీపీఓ పోస్టుకు 50, పీఓ పోస్టుకు 77, పీఓ ఎన్ఐసీ పోస్టుకు 73, ఎల్‌సీఓ పోస్టుకు 7, కౌన్సెలర్ పోస్టుకు 67, అకౌంటెంట్ పోస్టుకు 95, డేటా అనలిస్ట్‌కు 96, సహాయ డీఈఓకు 159, అవుట్ రీచ్ వర్కర్ పోస్టుకు 113, మేనేజర్ పోస్టుకు 34, సోషల్ వర్కర్‌కు 29, ఏఎన్ఎం పోస్టులకు 21, ఆయా పోస్టులకు 19, చౌకీదార్‌కు 8, వైద్యుని పోస్టులు ఒక దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. వాటిని పరిశీలించి 419 దరఖాస్తులను అర్హమైనవిగా నిర్ధారించామన్నారు. ఆయా పోస్టులకు ఈనెల 17, 18 తేదీల్లో సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఫలితాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నోటీస్ బోర్డులో ఉంచుతామని పీడీ వివరించారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.31.90 లక్షలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.31.90 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు మంగళవారం ఆలయంలో చేపట్టారు. 49 రోజులకు గాను హుండీ ద్వారా రూ.31,90,581, అన్నదాన హుండీ ద్వారా రూ.42,438 వచ్చిందని ఈఓ తెలిపారు. ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు హుండీ లెక్కింపు పర్యవేక్షించారు. ఆర్డీటీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పీఎస్‌ఓలు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: వీఐపీలకు భద్రత కల్పించడం సవాళ్లతో కూడుకున్నదని, అయినప్పటికీ విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉంటూ వీఐపీల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పీఎస్ఓ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాధవరెడ్డి భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అలాగే పీఎస్ఓలంతా ఫిట్‌గా ఉండేందుకు జిమ్, యోగాతో పాటు పరేడ్‌లో పాల్గొనాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్ఐలు టైటాస్, నారాయణ, రాజశేఖరరెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్‌రావ్, ప్రసాద్, ప్రదీప్‌సింగ్, రాజు, పలువురు పీఎస్ఓలు పాల్గొన్నారు.

హద్దు చూపి..రాళ్లు పాతి!

గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న భూవివాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా జగన్ సర్కార్ చేపట్టిన సమగ్ర భూ సర్వే (వైఎస్సార్ జగన్ శాశ్వత భూహక్కు– భూ రక్ష) జిల్లాలో జోరుగా సాగుతోంది. రైతుల సమక్షంలోనే భూములను సర్వే చేస్తున్నారు. హద్దులు చూపడంతో పాటు రాళ్లు పాతి వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. ఇప్పటికే 103 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి కాగా, శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలు పొందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో జోరుగా సాగుతున్న సమగ్ర భూసర్వే
- మూడు దశల్లో 227 గ్రామాల్లో పనులు
- 103 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- మ్యుటేషన్‌తో పాటు సర్వే రాళ్లూ ఉచితమే

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష' కింద సమగ్ర భూ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జిల్లాలో మూడు విడతలుగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో ఇప్పటికే రెండు విడత్లో 77 గ్రామాల్లో సర్వే పనులన్నీ పూర్తయ్యాయి. మూడో విడతలో 150 గ్రామాలకు గాను 26 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా, తక్కిన గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది.

సదస్సులతో ప్రజలకు అవగాహన

జిల్లాలో తొలి విడతగా 26, రెండో విడతలో 51 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యింది. ఇక మూడో విడతలో 150 గాను 26 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. ఈ సర్వేలో 32 మంది మండల సర్వేయర్లు, 374 మంది విలేజ్ సర్వేయర్లు పాల్గొంటున్నారు. రీ సర్వే పూర్తయితే రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రీ సర్వేపై ఇప్పటికే అన్ని మండలాల్లో ఆర్డీఓలు, తహసీల్దార్లు సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

91,239 సర్వే రాళ్లు నాటారు

జిల్లాలో చేపట్టిన మూడు విడతల రీ సర్వేలో ఇప్పటి వరకూ 91,239 సర్వేరాళ్లు నాటే కార్యక్రమం పూర్తయ్యింది. తక్కిన గ్రామాల్లో చేపట్టిన సర్వేకు అవసరమైన 46,167 రాళ్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మండల సరిహద్దులు, గ్రామ సరిహద్దులు, పొలం సరిహద్దులు, సర్వే నంబర్ల వారీగా రాళ్లను నాటుతూ రైతుల పొలం లెక్కను సరి చేస్తున్నారు. మరో పక్క తొలి, రెండో విడతలో ఇప్పటికే సర్వే పూర్తయిన 77 గ్రామాల్లోని రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు సైతం ఆయా మండలాలకు వచ్చేశాయి. తప్పొప్పులను సరిచూసి వాటిని రైతులకు అందజేయనున్నారు. ఇందులో సర్వే నంబర్ల వారీగా పొలం కొలతలు, స్కెచ్, సమగ్రంగా పొందు పరిచారు. వీటిని బైలింగ్వల్ పద్ధతిలో రెండు బాషల్లో పుస్తకాన్ని ముద్రించారు. క్యూ ఆర్ కోడ్‌ను సైతం పొందుపరిచారు. దీన్ని స్కాన్ చేస్తే పొలం విస్తీర్ణం, రైతుల వివరాలు తెలుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.




ఉచితంగా మ్యుటేషన్లు, సరిహద్దు రాళ్లు

'జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష' పథకంలో భాగంగా చేపట్టిన సర్వేలో ప్రభుత్వం ప్రతి రైతుకూ సబ్ డివిజన్, మ్యుటేషన్‌లతో పాటు సరిహద్దులో నాటే సర్వే రాళ్లను సైతం ఉచితంగా అందజేస్తోంది. గతంలో మ్యుటేషన్ చేయించాలంటే చాలా ఇబ్బందులుండేవి. రీ సర్వే వల్ల అలాంటి ఇబ్బందులన్నీ తీరాయి. రీ సర్వే పూర్తయితే రైతుల భూములు కొలిచి వారికి యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడం, డిజిటల్ రికార్డులు రూపొందించడంతో పాటు ప్రభుత్వమే ఉచితంగా మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు చేస్తోంది.

డిసెంబర్ చివరి నాటికి పూర్తి

ఇప్పటి వరకూ మూడు విడతల్లో చేపట్టిన రీ సర్వే కార్యక్రమం డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మూడో విడత గ్రామాల్లో ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తి చేసేందుకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. రీ సర్వేలో ఎలాంటి తప్పుల్లేకుండా నిర్వహించి సీసీఎల్ఏ ఆదేశాల మేరకు పూర్తి చేయనున్నట్లు పేర్కొంటున్నారు. మొదట రోవర్, డ్రోన్‌లతో గ్రామ, మండల సరిహద్దులు గుర్తిస్తారు. అనంతరం అత్యాధునిక పరికరాలతో పొలాల సరిహద్దులు గుర్తించి రాళ్లను నాటుతారు. రీ సర్వేలో రైతులు కచ్చితంగా పాల్గొనాలని, పొలాల సరిహద్దులు నిర్ణయించి రాళ్లను నాటే సమయంలో దగ్గరుండి సరి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలోని మండలాలు	32
రెవెన్యూ గ్రామాలు	461
జియోగ్రాఫికల్ ఏరియా	8,924 చ.కి.మీ
మొదటి విడత సర్వే చేసిన గ్రామాలు	26
రెండవ విడత సర్వే చేసిన గ్రామాలు	51
మూడవ విడత సర్వే చేస్తున్న గ్రామాలు	150
సర్వే పూర్తయిన గ్రామాలు	103
ఏర్పాటు చేసిన సర్వే రాళ్లు	91,239
సిద్ధంగా ఉన్న రాళ్లు	46,167
విధుల్లో ఉన్న సర్వేయర్ల సంఖ్య	406



సర్వే పూర్తయిన భూములకు ఇచ్చే పట్టాదార్ పాస్ పుస్తకం



గోరంట్ల మండలంలో సిద్ధం చేసిన సర్వే రాళ్లు

ప్రజలు సహకరించాలి



సర్వే సమయంలో పొలాల వద్దకు వచ్చిన సర్వే బృందానికి ప్రజలు, రైతులు సహకరించాలి. సమస్యలున్న భూములకు సంబంధించిన ఇరువర్గాలు ఒప్పుకుంటే అన్ని ఖర్చులతో ప్రభుత్వమే సర్వే చేస్తుంది. కోర్టు కేసులున్న రైతులు త్వరగా తెంచుకొని సర్వే అధికారులకు సహకరించాలి. ఇప్పటికే 103 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. రీ సర్వే కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. ఇప్పటికే అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాం.

– జీపీ రామకృష్ణన్,
జిల్లా సర్వే అండ్ భూ రికార్డుల అధికారి

సత్యసాయి జయంత్యుత్సవాలకు విచ్చేయండి
- గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించిన సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్

ప్రశాంతి నిలయం: 'అందరినీ ప్రేమించి, అందరినీ సేవించు' అంటూ ప్రపంచ వ్యాప్తంగా భక్తులను పొందిన సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం ఆహ్వానించింది. మంగళవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజుతో పాటు ట్రస్ట్ సభ్యులు విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగుతుందని, వేడుకల్లో పాల్గొనాలని కోరారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని ప్రశాంతి నిలయం మీడియా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. గవర్నర్‌ను కలిసిన వారిలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, ఎన్టీఆర్ జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రేతలకు జైలు శిక్ష

పుట్టపర్తి టౌన్: గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి టి.హరిత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2020 డిసెంబర్ 21న పుట్టపర్తిలోని సాయినగర్‌లో గంజాయి విక్రయిస్తున్న శ్రీనివాసులు, హర్షవర్దన్, రమేష్‌లను అప్పటి అర్బన్ సీఐ వెంకటేశ్‌నాయక్ తన సిబ్బందితో అరెస్టు చేశారు. విచారణ అనంతరం చార్జ్‌షీటు దాఖలు చేశారు. అనంతపురంలోని ఒకటో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టులో విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణరెడ్డి ఐదుగురు సాక్షులను విచారించారు. ఇరువర్గాల వాదనలు, కేసు పూర్వాపరాలు పరిశీలించిన మీదట నేరం రుజువు కావడంతో ముద్దాయిలు శ్రీనివాసులు, హర్షవర్దన్, రమేష్‌లకు నాలుగు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ జడ్జి టి.హరిత మంగళవారం తీర్పు చెప్పారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

- బాలల దినోత్సవంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి



ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి

పుట్టపర్తి అర్బన్: బాలల హక్కుల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి కోరారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి, చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ... బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ముఖ్యంగా భ్రూణహత్యలను నివారించి బాలలకు జీవించే హక్కు కల్పించాలన్నారు. అలాగే నిర్బంధ విద్యను అందించాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలల హక్కులను కాపాడాలంటే ప్రజలందరి సహకారం అవసరమన్నారు. బాలల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, అతిక్రమిస్తే విధించే శిక్షల వివరాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు.

పోస్టర్ల విడుదల

బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తుంటే వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులను కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ వారిని వేదికపై కూర్చోబెట్టి సత్కరించారు. విద్యార్థులందరికీ 'చైల్డ్ లైన్ సేదోస్తీ వీక్' పేరుతో చేతికి బ్యాండ్‌లు కట్టారు. అనంతరం ఈ ఏడాది చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి సీఐ కొండారెడ్డి, 'సెబ్' సీఐ మాధవి, సీడీపీఓ గాయత్రి, ఎస్ఐ రెడ్డప్ప, ఎన్‌జీఓ కోఆర్డినేటర్ ఎల్లప్ప, హెచ్ఎం ప్రభావతి, చైల్డ్‌లైన్ సిబ్బంది నిర్మల, హాసిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో వినియోగదారుల రక్షణ మండలి



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ చేతన్

- వినియోగదారుల చట్టాల అమలుకు పకడ్బందీ చర్యలు
- జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: వినియోగదారులు మోసపోకుండా జిల్లా స్థాయిలో వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా, మోసాలను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వినియోగదారుల రక్షణ చట్టాల అమలుపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... హక్కులు, చట్టాల గురించి వినియోగదారులకు తెలియజెప్పి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వినియోగదారుల చట్టం 1986 డిసెంబర్ 24న అమల్లోకి వచ్చిందని, దీనిద్వారా లోపభూయిష్ట వస్తువులు, అసంతృప్తికరమైన సేవలు, మోసపూరితమైన వాణిజ్య పద్ధతులు, దోపిడీని అరికట్టడమే ఈ చట్టం లక్ష్యమన్నారు. 1986 చట్టంలోని లోటుపాట్లను సమీక్షించి తిరిగి 2019లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ చట్టానికి తగిన ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే కమిషన్‌ను సంప్రదిస్తే సత్వర న్యాయం పొందవచ్చన్నారు. అయితే కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ రసీదు తీసుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టానికి స్వచ్ఛంద సేవా సంస్థలు, ఇతర ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధులకు గుర్తింపుకార్డులు అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి గౌస్, ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారి శ్రీధర్, జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్, వినియోగదారుల రక్షణ మండల సభ్యులు వెంకటేష్, గఫూర్, రామిరెడ్డి, భవ్య, నాగజ్యోతి, వెంకటరామప్ప, నారాయణమ్మ, పోలా ప్రభాకర్, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కుల గణన

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకూ జిల్లాలో కుల గణన చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్ చేతన్ తెలిపారు. మంగళవారం ఆయన, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కులగణన, వికసిత్ భారత్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు ఆయా అంశాలపై విజయవాడ నుంచి ప్రిన్సిపాల్ సెక్రెటరీ గిరిజా శంకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. కులగణన కార్యక్రమానికి తహసీల్దార్లు మండల నోడల్ ఆఫీసర్లుగా ఉంటారన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సమాచారం తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన చేస్తారన్నారు. ఇంటింటి సర్వేను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే నవంబర్ 15 నుంచి జనవరి 26వ తేదీ వరకూ 'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందులో కేంద్రం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని, లబ్ధిదారుల వివరాలను గ్రామ సభల ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న జేసీ చేతన్, అధికారులు

సామాజిక చైతన్యం.. సాధికార స్వరం

- నేడు 'పురం'లో సామాజిక సాధికార సదస్సు
- హాజరుకానున్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు
- ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైన ప్రజలు

హిందూపురం: ఎందరో ప్రముఖులకు రాజకీయంగా పునాది వేసి రాజకీయ చైతన్యానికి చిరునామాగా నిలిచిన హిందూపురం నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాల వారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలిపింది. అందరి ముందు తలెత్తుకుని తిరిగేలా చేసింది. ఈ నేపథ్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధి వివరించేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన బస్సు యాత్ర బుధవారం హిందూపురం చేరనుంది. ప్రజలు కూడా బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ ఒకరినే నమ్ముకుని నట్టేట మునిగాం...ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కడదామంటూ సమష్టిగా ముందుకు సాగుతున్నారు. బుధవారం జరగబోయే సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేసేందుకు ఉర్రూతలూగుతున్నారు. సామాజిక చైతన్యంతో...సాధికార స్వరం వినిపించేందుకు సిద్ధమయ్యారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టీఎస్.దీపిక ఆధ్వర్యంలో బుధవారం హిందూపురంలో సామాజిక సాధికార బస్సుయాత్ర సాగనుంది. తొలుత ఉదయం 11.30 గంటలకు సరిగమ ఫంక్షన్‌హాలులో మేధావుల సదస్సు జరగనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్దకు బస్సుయాత్ర చేరుకోనుంది. అనంతరం బహిరంగ సభ జరుగుతుంది. బహిరంగసభకు ముఖ్యఅతిథులుగా వైఎస్సా సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్, కర్నూలు ఎంపీ సంజీవయ్య, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దీపికతోపాటు ముఖ్యనాయకులు హాజరుకానున్నారు.



- విస్తరిస్తున్న టీ స్టాళ్లు, కేఫ్‌లు
- ఏ వీధిలో చూసినా కొట్లు
- నగర, పట్టణ శివారులో పెద్దపెద్ద కేఫ్‌లు
- పలు సౌకర్యాలతో విశాల ప్రదేశాల్లో ఏర్పాటు
- కావాల్సినంత సేపు సేదతీరుతూ ఆస్వాదిస్తున్న జనం

ఏమిటీ ఒరవడి!



ఒకప్పుడు టీ తాగడమనేది చాలా చిన్న విషయం. ఏ చిన్న కొట్టు దగ్గరికో వెళ్లి.. అర్జెంటుగా టీ తాగి వెంటనే కప్పు అక్కడ పెట్టి వచ్చిన దారిన వెళ్లిపోయేవారు. అయితే, కాలం మారింది. పద్ధతులూ మారాయి. అన్నింటా ఎం'జాయ్' కోరుకుంటున్న జనం టీ సేవనమూ అదే రీతిలో ఉండాలని భావిస్తున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా టీ కొట్లూ మారిపోయాయి. ఆధునిక హంగులు సంతరించుకున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో టీస్టాళ్లు/కేఫ్‌ల సంఖ్య (సుమారుగా)	
అనంతపురం	2,000
తాడిపత్రి	600
గుంతకల్లు	400
రాయదుర్గం	200
ధర్మవరం	600
హిందూపురం	400
కదిరి	400



హిందూపురంలోని ఓ టీ కేఫ్

సాక్షి, అనంతపురం డెస్క్: అనంతపురం నగరంలో ఒకప్పుడు టీ తాగాలంటే ఎక్కడ దొరుకుతుందా అని వెతకాల్సిన పరిస్థితి. కానీ, నేడు అలా కాదు. ప్రతి ఏరియాలోనూ టీ కేఫ్‌లు ఏర్పాటయ్యాయి. అదీ విశాల ప్రాంగణాల్లో. శివారు ప్రాంతాల్లో అయితే ఆధునిక హంగులతో పెద్దపెద్ద కేఫ్‌లు జనాన్ని ఆకర్షిస్తున్నాయి. తీరిగ్గా కూర్చొని.. అలా కబుర్లు చెప్పుకుంటూ టీ/కాఫీ తాగేందుకు వీలుగా ఏర్పాట్లు ఉంటున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో వీటి వద్ద రద్దీ ఎక్కువగా కన్పిస్తోంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు సైతం ఖాళీ సమయం దొరికితే చాలు కేఫ్‌ల బాట పడుతున్నారు. కొన్ని కేఫ్‌ల వద్ద కార్లు, బైకుల రద్దీని చూస్తే ఏమి'టీ' మార్పు అని ఆశ్చర్యం కలగకమానదు. ప్రస్తుతం వరల్డ్‌కప్ క్రికెట్ సీజన్ నడుస్తుండడంతో కేఫ్‌లు మరింత రద్దీగా మారాయి. ఒక్క అనంతపురం నగరంలోనే కాకుండా..ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం, కదిరి తదితర పట్టణ ప్రాంతాలు, చివరకు మండల కేంద్రాల్లో సైతం టీ కేఫ్‌ల సంస్కృతి విస్తరిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీస్టాళ్లు, కేఫ్‌లు కలిపి ఎనిమిది వేలకు పైగా ఉన్నట్లు అంచనా.

అభిరుచికి అనుగుణంగా..

ఒకప్పుడు టీ, కాఫీ అంటే ఆయా పొడులతో చేసేవే ఉండేవి. కానీ, నేడు వాటిలోనూ వివిధ రకాలు లభిస్తున్నాయి. సాధారణ టీతో పాటు అల్లం టీ, గ్రీన్ టీ, ఇరానీ ఛాయ్, పెప్పర్‌మెంట్ టీ, మసాలా టీ, లెమన్ టీ, లావెండర్ టీ.. ఇలా పలు రకాలు విభిన్న రుచుల్లో లభ్యమవుతున్నాయి. టీ మాత్రమే కాకుండా వివిధ రకాల కాఫీలు, రాగిమాల్ట్ వంటివి కూడా అందుబాటులో ఉంటున్నాయి. జనాన్ని ఆకర్షించేందుకు ఆయా దుకాణదారులు కొత్తదారులు అన్వేషిస్తున్నారు. ఫ్రీ వైఫై అంటూ యువతను ఆకర్షిస్తున్నారు. పెద్ద పెద్ద టీవీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆకట్టుకునేలా కుర్చీలు ఉంచుతున్నారు. టీ/కాఫీ అందించే కప్పులూ విభిన్నంగా ఉంటున్నాయి.



అనంతపురం శివారులో రద్దీగా ఉన్న ఓ టీ కేఫ్

బ్రాండ్‌లూ వచ్చేశాయి!

టీ కేఫ్‌లకు లభిస్తున్న ఆదరణ చూసి కొందరు వాటినీ 'బ్రాండ్'లుగా మార్చేస్తున్నారు. 'ఫ్రాంచైజీలు' ఇస్తూ చక్కగా సొమ్ము చేసుకుంటున్నారు. వారు నిర్దేశించిన మొత్తం చెల్లిస్తే ఔట్‌లెట్ డిజైన్ చేయించడంతో పాటు వివిధ రకాల టీలు, కాఫీలు తయారుచేయడానికి వీలుగా మెటీరియల్ సరఫరా చేస్తున్నారు. వాటి తయారీలో ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ఇలాంటి బ్రాండ్ కేఫ్‌లు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. మరీ ముఖ్యంగా జాతీయ రహదారుల పక్కన ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.

'ఉపాధి' మార్గం

చాలామంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గంగా టీ కేఫ్‌లను ఎంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడి వ్యయం, మంచి మాస్టర్లు దొరికితే నిర్వహణ సులువు కావడం, ఆదాయం కూడా తగినంతగా ఉండడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులోనూ యువత ఎక్కువగా ఉంటున్నారు. చదువుకుంటూ, ఉద్యోగం చేస్తూ ప్రత్యామ్నాయ ఆదాయం కోసం టీ కేఫ్‌లు నిర్వహించే వారూ ఉన్నారు.

'చర్చా'వేదికలు

కేఫ్‌లు కేవలం పిచ్చాపాటి కబుర్లతో టీ, కాఫీ సేవనానికే పరిమితం కాలేదు. 'చర్చా'వేదికలుగానూ మారాయి. ఇక్కడ రాజకీయ చర్చలు వేడీవేడిగా సాగుతుంటాయి. రియల్ ఎస్టేట్ లావాదేవీలు నడుస్తుంటాయి. ఉద్యోగ సంబంధ కార్యకలాపాలూ జరుగుతుంటాయి. పెళ్లి సంబంధాలూ కుదిరిపోతుంటాయి. ఇలా ఒకటేమిటి అనేక వ్యవహారాలకు టీ కేఫ్‌లు అడ్డాగా మారాయి.

అలా రిలాక్స్ అవుతా



నేను బ్యాంకులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నా. పని లేనప్పుడు కేఫ్‌నకు వచ్చి టీ తాగి రిలాక్స్ అవుతా. పైగా ఇక్కడ కొత్త పరిచయాలు కూడా ఏర్పడతాయి. రోజూ ఒకట్రెండు సార్లయినా టీ తాగి వెళ్తుంటా. – ఆదినారాయణ, బ్యాంకు ఉద్యోగి, హిందూపురం

కాసేపు మిత్రులతో మాట్లాడే అవకాశం



టీ తాగడానికి అలవాటు పడ్డాం. గతంతో పోల్చితే ఇప్పుడు పట్టణంలో చాలా టీ స్టాల్స్, కేఫ్‌లు వెలిశాయి. మిత్రులతో కలసి ఛాయ్ తాగి కాసేపు కబుర్లు చెప్పుకునేందుకు కేఫ్‌లు వేదికగా మారాయి.
– మారుతి, ముద్దిరెడ్డిపల్లి, హిందూపురం.

ఆదాయం బాగానే వస్తోంది



నేను గతంలో ఆర్డీటీ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేదాన్ని. ఆ ఉద్యోగం వదిలేసి ప్రస్తుతం ఆసుపత్రి సమీపంలోనే టీ కేఫ్ నిర్వహిస్తున్నా. దీన్ని ఓ కంపెనీ వారి నుంచి ఫ్రాంఛైజీ తీసుకున్నాం. ఆదాయం బాగానే ఉంటోంది. ఏ ఇద్దరు కలసినా టీ తాగుతూ మాట్లాడుకోవడం ఇప్పుడు పరిపాటిగా మారింది. అందువల్ల మా బిజినెస్ కూడా బాగానే అవుతోంది.
– సౌభాగ్య, బత్తలపల్లి

టీ కేఫ్ జీవనాధారం



ఇంటర్ చదువుతున్నప్పుడు ఓ టీ కేఫ్‌లో వర్కరుగా పనిచేసేవాణ్ని. అదే కేఫ్‌నకు ఓనర్‌గా ఎదిగా. ఇది నా కుటుంబానికి జీవనాధారంగా మారింది. పలు రకాల టీ తయారు చేస్తున్నా. ఆశించిన స్థాయిలో వ్యాపారం అవుతోంది. ఉపాధికి ఢోకా లేదు. నాన్న కూడా నాకు సహాయంగా ఉంటున్నారు. – ధనుంజయ, టీ కేఫ్ నిర్వాహకుడు, రాయదుర్గం





వైభవంగా శ్రీవారి వెండి రథోత్సవం



కదిరి టౌన్: కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుల వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాన్ని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. అలాగే గర్భాలయం ఎదుట ఉన్న ముఖ మంటపానికి దాదాపు 72 కేజీల వెండితో తయారు చేయించిన తొడుగును బెంగళూరుకు చెందిన లక్ష్మమ్మ, మంజునాథ్ కుటుంబసభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పాలక మండలి తరఫున ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు, స్వామి శేష వస్త్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపండి
- సిబ్బందికి ఎస్పీ ఆదేశం
- పురం డీఎస్పీ కార్యాలయం తనిఖీ



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

హిందూపురం అర్బన్: పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, క్రమం తప్పకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఎన్నికలు నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. అల్లర్లకు కారణమయ్యే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అలాగే వాహన తనిఖీలు నిరంతరం చేపట్టాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. గ్రేవ్ కేసుల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి తగిన ఆధారాలతో ముద్దాయిలకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై పోలీసులు, సెబ్ అధికారులు నిరంతరం దాడులు చేస్తూ సమూలంగా నిర్మూలించాలన్నారు. కర్ణాటక నుంచి మద్యం ప్రవేశించకుండా చెక్ పోస్టుల్లో సిబ్బందిని మరింత అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. లాకప్ గదులు, రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మహిళా పోలీసులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజాక్షన్, సీఐలు రియాజ్ అహమ్మద్, వేణుగోపాల్, సీసీ రాఘవేంద్ర, సీఐలు వై.శ్రీనివాసులు, వి.శ్రీనివాసులు ఎస్‌ఐ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్

- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 246 మంది బాలబాలికలు రాక



రంగోలి విభాగంలో విజేతలను అభినందిస్తున్న విశాల ఫెర్రర్

అనంతపురం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ప్రారంభించి, ప్రసంగించారు. పిల్లల్లో సృజనాత్మకత నైపుణ్యాలను పెంపొందించేందుకు గత 40 ఏళ్లుగా ఆర్ట్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది ఆరు అంశాలపై పోటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 41 ప్రాంతాల నుంచి తరలివచ్చిన 246 మంది బాలబాలికలకు చేతిరాత, రంగోళి, చిత్రలేఖనం, ఒరిగామి ఆర్ట్ వర్క్, న్యాచురల్ కొలేజ్, మట్టితో బొమ్మల తయారీ (క్లే ఆర్ట్) పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలను ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి, స్పానిష్‌కు చెందిన ఆర్డీటీ ప్రతినిధులు అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు గంగన్న

ముదిగుబ్బ: స్థానిక పాతూరుకు వెళ్లే మార్గంలో రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. మృతుడిని ఎస్సీ కాలనీకి చెందిన గుండ్రాళ్ల గంగన్న(65)గా గుర్తించారు. కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న గంగన్న మంగళవారం తెల్లవారుజామున రైల్వే గేటు వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళుతున్న సమయంలో రైలు ఢీకొంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అటవీ శాఖలో పదోన్నతులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అసిస్టెంట్ కన్జర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులకు సబ్ డీఎఫ్‌ఓగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం రేంజ్ పరిధిలో బుక్కపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్‌కు పలమనేరు సబ్ డీఎఫ్ఓగా, కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌కు శ్రీశైలం సబ్ డీఎఫ్ఓగా పదోన్నతి కల్పించారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి

అనంతపురం అగ్రికల్చర్: సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత పిలుపునిచ్చారు. స్థానిక డీసీసీబీ హాలులో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సహకార పతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. 'భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర' అంశంపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ... సహకార రంగం ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలు, సహకార రంగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర అన్ని వర్గాలకూ అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు, రుణాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. భావితరాలకు, సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీసీఓ ఎం.ప్రభాకరరెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, బ్యాంకు సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

చెన్నేకొత్తపల్లి: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన మంగలి నారాయణ కుమారుడు వెంకటేసులు (49)కు భార్య రాధమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం రాత్రి పొలంలో పనిచేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మంగళవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు.

సెబ్ విస్తృత తనిఖీ

పుట్టపర్తి టౌన్: జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు తనకల్లు, పెనుకొండ సెబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలోని కమ్మవారిపల్లి వద్ద 480 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పెనుకొండ పరిధిలో 96 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

కిడ్నాపర్ అరెస్ట్

పుట్టపర్తి టౌన్: బాలిక లక్షిత కిడ్నాప్ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ కొండారెడ్డి వెల్లడించారు. ఈ నెల 10న పుట్టపర్తిలోని మోర్ సూపర్ బజార్ వద్ద లక్షిత కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసును ఛేదించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు పోలీసులు చేర్చారు. అనంతరం కొనసాగించిన విచారణలో నిందితుడిని నల్లమాడ మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన మత్రిమేకల సాయికుమార్‌గా మంగళవారం ఉదయం కర్ణాటక నాగేపల్లి వద్ద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

20 నుంచి ఆర్టీసీ 'త్రిలింగ దర్శనం'

పుట్టపర్తి టౌన్: కార్తీకమాసంలో శైవలాయాలను దర్శించుకునే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ త్రిలింగ దర్శనం పేరుతో బుగ్గరామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది క్షేత్రాలకు బస్సులు నడుపుతోంది. భక్తులు ఒకేరోజు ఈ మూడు క్షేత్రాలు దర్శించుకునేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈనెల 20, 27వ తేదీలతో పాటు డిసెంబర్ 4, 7తేదీల్లో ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, మూడు క్షేత్రాల దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం తిరిగి వస్తాయన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచుతామన్నారు. 40 మంది భక్తులు బ్యాచ్‌గా ఏర్పడితే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. www.apsrtc.online.in వెబ్‌సైట్ నుంచి ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఆర్టీసీ బస్సు డిపోలో సంప్రదించాలని సూచించారు. అలాగే కార్తీకంలో అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డీపీటీఓ వెల్లడించారు.

సాయి బోధనలు సన్మార్గ సూచికలు



నృత్యరూపకంలోని సన్నివేశం

ప్రశాంతి నిలయం: లోకకళ్యాణానికి పాటుపడిన సత్యసాయి బోధనలు సమస్త మానవళిని సన్మార్గంలో పయనించేందుకు దోహదపడ్డాయంటూ బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన గుజరాత్‌లోని సూరత్, అహమ్మదాబాద్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

జేఎన్‌టీయూ(ఏ) ప్రొఫెసర్ ప్రశాంతి ఆవిష్కరణకు దక్కిన పేటెంట్

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ జి.ప్రశాంతి పరిశోధనకు పేటెంట్ దక్కింది. ప్రొఫెసర్ జి.ప్రశాంతి, పరిశోధన విద్యార్థి ఎం.శివ సూర్య సంయుక్తంగా 'ఏ న్యూ మెథడ్ టు ఫ్యాబ్రికేట్ డిఫరెంట్ లేయర్డ్ ఎల్ 7075/ఎస్ఐసీ ఫంక్షనల్లీ గ్రేడ్డ్ మెటీరియల్స్ యూసింగ్ పవర్ మెటాలర్జీ టెక్నిక్' అంశంపై చేసిన పరిశోధనకు గాను పేటెంట్ దక్కింది. ఈ పరిశోధన ముఖ్యంగా వాహనాల బ్రేక్ కాంటాక్ట్‌కి సంబంధించినది కావడం గమనార్హం. తక్కువ ఖర్చుతో ఎక్కువ మన్నిక వచ్చేలా 10 ఎం.ఎం. మందం గల బ్రేక్ సత్ఫలితాలను ఇచ్చింది. 2021, మార్చి నెలలో పేటెంట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 14న పేటెంట్ గ్రాంట్ అయినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. ప్రశాంతిని వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన తదితరులు మంగళవారం సన్మానించారు.

పుట్టపర్తిలో కొండచిలువ కలకలం



కొండచిలువను బంధించిన మూర్తి

పుట్టపర్తిరూరల్: స్థానిక డీఎస్పీ బంగ్లా సమీపంలో మంగళవారం ఉదయం దాదాపు 15 అడుగుల పొడవున్న కొండ చిలువ ప్రత్యక్షమైంది. అక్కడున్న ఓ కోడిని పట్టుకోవడంతో పక్కనే కోళ్ల గగ్గోలు పెట్టడంతో స్థానికులు అటుగా గమనించారు. కొండ చిలువను చూడగానే దేశవిదేశీయులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ మూర్తి అక్కడకు చేరుకుని కొండ చిలువను బంధించి అమగొండపాళ్యం అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM నర్సింగ్ అడ్మిషన్స్

■ చివరి అవకాశం – ఇంటర్ పాస్ స్టూడెంట్స్‌కి గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీలో హాస్టల్ కలదు. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2756]

NURSING ADMISSIONS

■ 2nd కౌన్సిలింగ్‌లో B.Sc. (Nursing) లో సీట్స్ రానివారికి 3rd కౌన్సిలింగ్‌లో Government సీట్స్ కోసం సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2757]

EDUCATION

■ ONE SITTING : 10th, 12th, Degreee, PG, B.Tech, M.Tech, Nursing, Pharmacy, B.ed, Agri, (For Discont) Recog. University. 89192 13858. [L-798917]

REAL ESTATE

LAND FOR SALE

■ హైదరాబాద్ – విజయవాడ హైవే రామోజీ ఫిల్మ్‌సిటి దగ్గర R1 జోన్‌లో గల 100 ఎకరములు వెంచర్ ల్యాండ్ అమ్మబడును. Qly జెన్యూన్ బయ్యర్స్, సంప్ర: 7702595564. [C-777412]

SERVICES

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో ఋణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220945]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-5962]

BUSINESS OFFER

■ విజయవంతమైన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా రోజుకు 1000 – 5000 రూ॥లు సంపాదించు అవకాశం. ఫోన్. 8099111616 [HA-35477]

WANTED

■ ATP, రుద్రంపేట, D-మార్ట్ దగ్గర్లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q : 10th పాస్, జీతం : 11 వేలు + EPF & ESIC కలవు. 12 గం॥ డ్యూటీ. వయస్సు : 35-45 లోపు. సెల్ : 9381838140. [A-784451]

■ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం, తేజ జాబ్స్ వారి ఆధ్వర్యంలో మీ విద్యా అర్హతకు తగిన ప్రైవేట్ కంపెనీల నందు జాబ్స్ చూపించబడును. గో: స్పాట్ జాయినింగ్. సంప్ర : 9441185663. [A-1336]

■ వర్కర్స్ కావలెను : 10వ తరగతి చదివిన వారు తమ బయోడేటాతో సంప్ర : SLV బుక్‌స్టాల్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, ATP. సెల్ : 9848080123, 9705974730 [A-2776]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1221913]

■ హైదరాబాద్ నందు 250 మంది స్టూడెంట్స్ ఉన్న పిజి హాస్టల్ నందు వంట చేయుటకు భార్యాభర్తల జంట కావలెను. ఆసక్తి గల వారు సంప్రదించండి : 99499 66477. [L-781132]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-1195]

■ స్టార్ హోమ్ కేర్ HYD వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీ కేర్ ఇంటి / వంట పనికి స్త్రీ / పు కావలెను. జీతం : 18k -25k, రూం / భోజనం ఉచితం, ఏజెంట్ కమీషన్ కలదు. ఫోన్: 94904 82881, 86398 28228 [V-797388]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221871]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను ఫ్రీవసతి+భోజనం జీ: 18K. Ph: 9640468899/9640258899 [HA-857]

■ హైదరాబాద్‌లో వృద్ధులను వారి ఇంట్లోనే ఉండి చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ:15-25 వేలు, ఏజెంట్ కమీషన్3-5 వేలు, 25-50 సం॥లు. హేమ హోమ్ కేర్. 7330746999 [HA-12537]

■ జాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో హౌస్ కీపింగ్ స్త్రీలు, ఆఫీస్ బాయ్, ప్యాకింగ్ హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ ఏజెన్సీలో అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్, అపరేషన్ మేనేజర్ అనంతపురంలో కావలెను. సంప్ర: 9989139239 [T-1258757]

■ WANTED COMPUTER OPERATOR 3-5 YEARS EXPERIENCE IN MS OFFICE. MALE PERSONS ONLY. CONTACT: 81217 26768. [A-6203]

■ Wanted : Python & Oracle (SQL) Faculty Min. Exp : 3 yrs. Salary : 30,000+Lodging & Boarding. # Sai Institution, Kamala Nagar, Anantapuramu. Cell : 9059723829. [A-784453]

■ బుక్ షాపు నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. (Girls-2 + Boys-2) డిగ్రీ చదివి, స్థానికంగా ఉన్నవారికి ప్రాధాన్యత. సం॥: అనూ బుక్ సెంటర్, 15/597, SRS Lodge దగ్గర, కమలానగర్, ATP. Cell: 7386932819. [C-777408]

■ ప్రముఖ ఇన్సూరెన్స్ (RNLIC) కంపెనీ అనంతపూర్‌లో పార్ట్ టైం/ఫుల్ టైం జాబ్స్ కలవు. H.W/Retd.EMP/BUSINESS/Postal Agents/other Insurance Agents/Un EMPL/others. CONT: 94407 32147. [L-781133]

■ Joy E Bikes అనంతపురము షోరూమ్ నందు పనిచేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, బైక్ మెకానిక్స్, స్త్రీ/పు కావలెను. జీతం: మేనేజర్‌కి 10 వేలు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌కి 8 వేలు + TA & DA + ఇన్సెంటివ్స్, మెకానిక్‌కి జీతం : 12 వేలు ఇవ్వబడును. సంప్ర : 9154442650, 6303594989. [A-776947]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.